


# దటీజ్ పాము ఆటరా...

కందుల మాలకొండరావుగాడికి సైకిలు తొక్కడమే రాదు.

వాడు చూడ్డానికి రొంత పొట్టిగా రొంత దిట్టంగా ఉన్నా మరీ సైకిలు మీద కూచోబెడితే కాళ్లు పెడలికి అందకుండా పోయేంత పొట్టి కాదు.

అందుకని వాడితో చెప్పా..

'ఒరే మాలకొండిగా. నా సంగతి జూడు. అప్పుడే ఆపుపెడలు వచ్చేసింది. ఇంక రొంత ట్రయి చేస్తే ఫుల్ సీటు గూడా వచ్చేసినట్టే. చేతులు ఒదిలేసి తొక్కడం ఒకటి ప్రాక్టీసు చేసినానంటే యింక అంతా వచ్చేసినట్టే. నా మాటిను. మనం పెద్దోళ్లయ్యాం. ఏడు దాటి ఎనిమిదో కిలాసులోకి వచ్చేసున్నాం. యింక రేపో మర్నాడో లుంగీలు గట్టుకొని సెకండ్‌షోలకి కూడా ఎళ్లిరావచ్చు. అట్టాంటిది నీకు యింకా సైకిలు తొక్కడం రాదంటే లోకం ఊయదా? అసలికి ఆడపిలకాయలు నిన్ను కేరు చేస్తారా? సీమసింత గుబ్బల్ని మెక్కడంలో ఉండే ద్యాస ఈ పనిలో కూడా పెట్టరాదా' అన్నాను.

'ఏం చేయమంటావురా.. నాకెవరు నేర్పిస్తారురా' అన్నాడు వాడు మొకం చిన్నంగా పెట్టి.

'బలేవాడివిరా... నేను నేర్పిస్తాను రా' అని, వాళ్ల నాయన అన్నానికి వచ్చి సైకిలు బయటపెట్టినప్పుడు నైసుగా వాణ్ణి దాని మీద కూచోబెట్టి ఏం బయం లేదు ఏం బయం లేదు అంటా ఒక్క తోపు తోసినాను.

అంతే. వాడు ఆ వాటాన పోవడం పోవడం.. కరెంటు స్తంబాన్ని గుద్ది దబేలుమని కిందపడిపోవడం.. మోకాలిచిప్ప పగిలిపోవడం.. ఆ సౌండుకి వాళ్ల నాయన బయటికి రావడం.. హ్యాండిలు బెండు చేసినందుకు అన్నం తింటున్న చేత్తోనే వాణ్ణి ఉతికి పారేయడం మినిట్టులో జరిగిపోయింది.

ఆ దెబ్బతో వాడు మళ్లా జీవితంలో సైకిలు అనే మాట ఎత్తలా. ఎంతదూరమైనా కాలి కొద్దీ నడస్తానే ఉంటాడు యిప్పటికీ. కానీ అంత కష్టం చెయ్యడం నా వల్ల కాదు. అసలే నేను నాజూకు పిల్లోణ్ణి. పలుచటి పిల్లోణ్ణి.

పోలేరమ్మబండకాడున్న మా ఇళ్ల నుంచి రైలుకట్ట అవతల ఉన్న మా ఇశ్వోదయ వరకు కిలోమీటరు దూరం ఉంటే అంత దూరం పొద్దున ఇస్కూలికి పోయేటప్పుడు ఒక సారి, మద్యానం అన్నాలకని ఒకసారి, సాయంత్రం మళ్లా ఇస్కూలు నుంచి యింటికి ఒక సారి మూడుసార్లు మూడు కిలోమీటర్లు వచ్చిపోవాలంటే రాను రాను నాకు చాలా కష్టమైపోయింది. కాళ్లు వాచిపోతా ఉన్నాయి.

అందుకని ఏమి చేయాలి అనుకున్నాను. ఈ బాదంతా లేకుండా ఉండాలంటే ఒక సైకిలు ఉంటే చాలదా అనుకున్నాను.

కానీ సైకిలు ఎట్టా?

కాండూరి మురళీదర్‌గాడికి వాళ్ల నాయన గుంటూరికి పోతా పోతా ఆయన అంత కాలం వాడుకుంటా వచ్చిన సైకిలిచ్చేసిపోయినాడు. అయితే అది బలే పాతబండి. డబుల్సు లాగదు. ఓవరాయిలింగు చేపిస్తే మురళీగాడు నాబోటి పిలకాయల్ని ఎనక ఎక్కించుకుంటాడని చెప్పి వాళ్ల తాత ఓవరాయిలింగు చేపిచ్చకుండా వాణ్ణి యాపక తింటా ఉన్నాడు. కాబట్టి వాడి సైకిలు మీద ఆశలు పనికిరావు.

మరెట్టా? సైకిలు ఎట్టా?

మా నాయనను అడిగితే?

పాపం ఖాకీ చెడ్డీ తెల్లసొక్కా ఉండే మా ఇశ్వోదయా యూనీఫారాన్ని రెండు జతలు కుట్టిచ్చేపాటికే ఆయన పని అయిపోయిందే... యింక కొత్త సైకిలు మాట అయ్యే పనేనా?

మరి ఎట్టా? ఏమి చేయాలి?

ఇంకప్పుడు నా కన్ను మా యిళ్ళకాడ ఉండే కేతిరెడ్డి శ్రీదరరెడ్డిగాడి మీద పడింది.

వాళ్లు డబ్బునోళ్లు. మా పాతూరులో పెద్ద మిద్దోళ్లు. వాళ్ల యింట్లో ఉన్న పెద్ద ఖాళీ జాగాలో నందివర్దనాలు, నూరువరహాలు, గోరింటాకు చెట్లు, జామ చెట్లు ఏసుకొని ఒకరి జోలికి రాకుండా వారి జోలికి ఒకరు పోకుండా తోటలో బతికినట్టుగా బతికే పంటరెడ్లు.

వాళ్ల నాయన కేతిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి కరెంటు స్తంబాలు నాటిపిచ్చే కాంట్రాక్టరుగాబట్టి

మా లాగా వాళ్లకి రూపాయికి బేడకి యిబ్బంది లేదు కాబట్టి శ్రీదరుగాడు యిశ్వోదయలో చేరీ చేరంగానే వాడికి ఒక కొత్త సైకిలు కొనిపిచ్చేసినాడు. అదీ మామూలు సైకిలు కాదు. న్యూ వెరైటీ.. పేరు బిఎస్సే ఎస్సెల్లార్.

అప్పటిదాకా నాకు హీరో అట్లాస్ హంబర్ సైకిళ్లే తెలుసు. కానీ అయ్యన్నీ నల్లటైర్లవి. కానీ బిఎస్సే ఎస్సెల్లార్ మాత్రం తెల్లటైర్లది. దీని మాడలు బాగుంది. ఎనక కేరేజీ బాగుంది.. సీటు బాగుంది.. షేపు బాగుంది..

అయితే ఏమి లాబం?

శ్రీదరుగాడితో మనకేమీ సావాసం లేదు.

కందుల మాలకొండరావుగాడు, కాండూరి మురళీదర్‌గాడు అనంటే నాతోపాటే మా యిద్యానికేతన్‌లో చదువుకొని ఇప్పుడు నాతో పాటే ఇశ్వోదయలో చేరినారుగానీ శ్రీదరుగాడు అట్టగాదు. వాడు శారదానికేతన్ అనే యింకో బడిలో చదివినాడు. ఇప్పుడు మేము చేరినట్టే ఇశ్వోదయలో ఎనిమిదిలో చేరినాడు. మేం ముగ్గురం సిసెక్షన్. వీడు బి సెక్షన్.

అదీగాక కేతిరెడ్డి ప్రబాకరరెడ్డికి వీడు ఒక్కడే కొడుకుగాబట్టి, తక్కిన ఇద్దరూ ఆడ పిలకాయలు గాబట్టి, వీడు చూడ్డానికి దొరబిడ్డలా అవుపిస్తాడు గాబట్టి దిష్టి తగులుద్దనో, ఎవురైనా ఎత్తకపోతారనో ఏం పాడో వీళ్ల అమ్మగానీ, నాయనగానీ, నాయనమ్మగానీ వీణ్ణి బయటికి తిరగనిచ్చేవారుగాదు. ఒకరితో మాట్లాడనిచ్చేవారుగాదు.

సైకిలు కొనిచ్చాకగూడా 'ఒరే బాబూ. నా మాట యిను. అసలికే కొత్తబండి. ఎనక క్యారేజీ తీపిచ్చేస్తాను. అది ఉన్నప్పటి కాణ్ణుంచి ఎవరో ఒకరు ఎక్కి కూచుంటారు. పాడు జేస్తారు' అన్నాడంట వాళ్ల నాయన.

నా టైము బాగుండి 'ఉన్నీ నాన' అని వాడు దాన్ని ఉండనిచ్చాడు.

ఇప్పుడు కొత్త సైకిలు ఉంది. ఎనక క్యారేజీ ఉంది. ఎక్కడానికి మనం ఉన్నాం.

ఇంక కావలిసింది మార్గమే.

దాని కొరకు ముందు శ్రీదరుగాడితో ఫ్రెండ్‌షిప్పు చేయాలి. చేయాలంటే వాడికి ఏమేమి యిష్టమో కనుక్కోవాలి. కనుక్కున్నాను.

వాడికి కిర్‌కెట్ అంటే యిష్టం అంట.

మనకి బిళ్లంగోడు తప్ప వేరే ఏ ఆట గురించి పెద్దగా తెలియదుగాబట్టి ఆ పాయింటు మీద వాడితో మాట్లాడలేము.

లెక్కలంటే యింట్రెస్టు. హు. దీని సంగతి అస్సలు మాట్లాడలేము.

ఇంక మూడోది కామెడీ.

'వాడికి జోకులంటే బలే యిష్టంరా' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

అబ్బ. దొరికాడురా అనుకొని ఆ రోజు ఇంటర్‌బెల్లులో 'శ్రీదరా శ్రీదరా' అని పిలిచినాను వాడిని.

వాడు 'ఎవడ్రా నువ్వు?' అన్నట్టుగా నా తట్టు చూసి 'ఏంది?' అని అడిగాడు.

'ఇట్రారా. ఒక తమాషా చూపిస్తాను రారా' అన్నాను.

వాడు వచ్చి 'ఏమి తమాషారా?' అన్నాడు కొంచెం ఇంట్రెస్టుగా.

'నేనిప్పుడు ఉత్తపుణ్యానికి ఒకడి కడుపులో గుద్దతానురా. కానీ వాడు నన్ను ఏమీ అనలేడురా. చూస్తావా?' అన్నాను.

వాడి కళ్లు పెద్దవయ్యాయి.

'అదెట్టా' అన్నాడు.

'చూస్తా ఉండు' అని వాణ్ణి అక్కడ నిలబెట్టి 'ఒరే మురళీ... మురళీగా' అని పిలిచాను కాండూరి మురళీగాణ్ణి.

వాడు పావలాకి ఐదువచ్చే చిన్నబొరుగుముద్దల్ని నమలతా 'ఏందిరా?' అని వచ్చి నా కాడ నిలబడ్డాడు అమాయకంగా.

నేను గొంతు గుసగుసగా పెట్టి సీక్రేటు చెబుతున్నట్టుగా 'ఒరే మురళీగా... టాపు సీక్రెటురా' అన్నాను.

వాడు 'ఏందిరా ఏందిరా' అన్నాడు.

'యియ్యాల పొద్దున పోలేరమ్మబండ కాడ'... అన్నాను.

వాడు ముందుకు తలకాయ వంచి 'ఆ.. పోలేరమ్మబండకాడ' అన్నాడు టెన్షనుగా.

'ఎట్టొచ్చిందో ఏమో'

'ఆ...ఎట్టొచ్చిందో ఏమో'.... వాడు బొరుగుముద్ద నమలడం మానేసినాడు.

నేను ఆపి, 'వద్దులేరా. నువు మళ్లా బయపడతావు. ఆనేక చెబుతాలే'... అన్నాను పోబోతున్నట్టుగా.

'కాదురా. చెప్పరా చెప్పరా' అన్నాడు వాడు.

నేను రెండు చేతులు పైకి ఎత్తి, వాడి పొట్టకు దగ్గరగా తీసుకొని వచ్చి, మందం చూపించడానికి అన్నట్టుగా 'ఇంతలావు పాము'....

'ఆ.. ఇంతలావు పాము'...

'అది ఇం....థ పొడుగు ఉందిరా'... అని ఆ పొడుగు చూపిచ్చడానికి యిసిరినట్టుగా స్పీడుగా చేతులు బారజాపేసరికి నా కుడి చెయ్యి ఎళ్లి వాడి పొట్టలో ఫెటీమని తగిలింది.

ఆ పని మనం ఎంత న్యాక్‌గా చేయాలంటే చూడ్డానికి అది పాము పొడుగు చూపించబోయినట్టుగా ఉండాలి, పొరపాటున ఆ ఇసురుకి చేయి ఎదుటివాడి పొట్టకి తగిలినట్టుగా ఉండాలి, దెబ్బ అదిరిపోవాలి, కానీ అనుమానం మాత్రం రాకూడదు.

ఇట్టా అనుమానం రాకుండా మనం కొట్టిన దెబ్బకి 'అబ్బా' అంటా మురళీగాడు నోట్లోని బొరుగుముద్దని వొదిలేశాడు.

'ఇస్స్... అరెరె... సారీరా.. చూసుకోలేదురా. స్పీడులో తగిలిందిరా. ఇంతలావు అంత పాము కనిపించిందని ఎవురో చెప్పుకుంటుంటే యిన్నానని చెప్పబోతా యిలా చేశానురా. సారీరా' అని వాణ్ణి సవరదీశాను.

శ్రీదరుగాడికి నా యాక్షను మొకం, మురళీగాడి ఏడుపు మొకం చూసి నవ్వు వస్తా ఉందిగానీ కంట్రోలు చేసుకుంటా ఉన్నాడు.

'నవ్వంతేరా. యిట్టగే చేస్తావురా' అని, కింద పడ్డ బొరుగుముద్దని బూదేవికి వదిలి ఎళ్లిపోయాడు మురళీగాడు.

వాణ్ణట్ట ఎళ్లనిచ్చి 'ఎట్టుందిరా?' అని అడిగాను శ్రీదరుగాణ్ణి.

'సూపరురా' అన్నాడు వాడు.

అప్పటికే వాడి మొకం చూస్తా ఉంటే నాతో ఫ్రెండ్‌షిప్ చేయడానికి రెడీ అయిపోయి నట్టుగా కనిపించింది.

'అప్పుడే ఏమైందిరా? నీ సైకిలు గనక నన్ను ఎక్కనిచ్చావంటే రోజుకొకటి యిట్టాంటివి తమాషాలెన్నో చూపిస్తానురా' అన్నాను వాడితో.

'అట్టాగైతే సరేరా. కానీ డబుల్సు నేను తొక్కలేనురా' అన్నాడు వాడు.

'ఆ ప్రాబ్లము నాకు వదిలిపెట్టరా. నేను తొక్కుతానురా' అన్నాను వాడితో.

వాడు చేయి కలిపినాడు.

నేను షేక్‌హ్యాండు ఇచ్చినాను.

ఆ తర్వాత మేము నవ్వుకుంటా మాటలు చెప్పుకుంటా ఎళతా ఉంటే మురళీగాడికి జరిగిన మోసం అర్ధమైనట్టుంది వాడు మాకాడికి వచ్చి 'అమ్మ నాయాళ్లారా' అన్నాడు కోపంగా.

'దట్ ఈజ్ పాము ఆటరా' అన్నాను నేను.

'అయితే చూడండిరా నేను కూడా ఆడతా' అని కచ్చ తీర్చుకోవడానికి అన్నట్టుగా 'మాలకొండయ్యా, ఒరే మాలకొండయ్యా' అని పిలిచాడు దూరంగా పోతున్న మాలకొండ రావుగాడిని.

'ఏందిరా?' అంటా వచ్చాడు మాలకొండరావు వాడి కాడికి.

వాడు సీక్రేటు చెబుతున్నట్టుగా మొకం పెట్టి 'ఇయ్యాల పొద్దునా పోలేరమ్మబండకాడా...' అని మా వైపు చూసి ముసిముసిగా నవ్వాడు.

మేం గూడా నవ్వాం ముసిముసిగా.

ఆ తర్వాత ఆ రోజంతా మా ఇశ్వోదయాలో ఈ పాము ఆట.

ఆ సాయంత్రం శ్రీదరుగాడి కొత్త సైకిలు మీద మన సవారీ.

■